స్మార్ట్ పేమెంట్



మొన్నటి వరకూ ఇంటి నుంచి బయటకు వెళితే జేబులో డబ్బులు పెట్టుకుని వెళ్లే వాళ్లం.

ఇప్పుడు కాలం మారింది. టీ తాగాలన్నా, మార్కెట్‌లో సరకులు కొనుగోలు చేయాలన్నా, ఇతర ఏ వస్తువు కొనాలన్నా చేతిలో రూపాయి అవసరం లేదు. జేబులో ఓ స్మార్ట్ ఫోన్ ఉండి, ఖాతాలో డబ్బులు ఉంటే చాలు.. ప్రతి లావాదేవీని సులభంగా చేయవచ్చు. కావాల్సిన వస్తువు కొనుగోలు చేయవచ్చు.. నచ్చిన హోటల్లో భోజనం చేయవచ్చు. గతంలో పెద్ద పెద్ద మాల్స్, బడా వ్యాపార సంస్థలకే పరిమితమైన డిజిటల్ పేమెంట్లు.. ఇప్పుడు రోడ్డు పక్కన దుకాణాల చెంతకు వచ్చేశాయి. వీధి వ్యాపారుల నుంచి టీ దుకాణాల వద్ద సైతం గూగుల్ పే, క్యూ ఆర్ కోడ్ స్కానర్‌లు వచ్చేశాయి. దీని వల్ల చిల్లర సమస్యకు చెక్ పడిందని వ్యాపారులు, వినియోగదారులు చెబుతున్నారు. – పెదగంట్యాడ





పువ్వులు కొనాలన్నా స్కానరే ..



ఉల్లిపాయల దుకాణం వద్ద స్కానర్లు



- పెరిగిన ఆన్‌లైన్ లావాదేవీలు
- అంతా డిజిటల్ వైపు అడుగులు
- మండలంలో సుమారు 1100 మంది చిరు వ్యాపారులు

ప్రస్తుతం స్కానర్లు చిరు వ్యాపారులకు సైతం అందుబాటులో వచ్చాయి. డిజిటల్ లావాదేవీలు పెరగడంతో థర్డ్ పార్టీ నిర్వాహకులు అన్ని దుకాణాల వద్దకు వెళ్లి పేమెంట్ స్కానర్లు పెడుతున్నారు. పెదగంట్యాడ మండలంలో మొత్తం చిల్లర వ్యాపారులు, తోపుడు బండ్లు,పానీపూరీ బండ్లు, ఇస్త్రీ దుకాణాలు, కూరగాయలు, చాట్ బండ్లు, టిఫిన్ బండ్లు వంటి దుకాణాలు సుమారు 1100 వరకూ ఉంటాయి. వీటికి రోజుకు రూ. 2000 నుంచి రూ. 20000వరకు లావాదేవీలు జరుగుతుంటాయి. వీటిలో దాదాపు 80 శాతం వరకు లావాదేవీలు డిజిటల్ చెల్లింపుల ద్వారా జరుగుతున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు.

స్పీకర్‌తో మోసాలకు చెక్



ఆన్‌లైన్ చెల్లింపులో ఉపయోగాలతో పాటు ఆదమరిస్తే మోసానికి గురయ్యే అవకాశం ఉంది. వీటిపై అవగాహన లేని వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని కొందరు మాయగాళ్లు మోసాలకు పాల్పడేవారు. సరకులను కొనుగోలు చేసిన తర్వాత వారి ఖాతాలకు అమౌంట్ బదిలీ చేసి.. సెల్ ఫోన్ స్క్రీన్ పై వచ్చిన మెసేజ్‌ను దుకాణదారునికి చూపించి పే చేసినట్లు అక్కడ నుంచి జారుకునే సంఘటనలు చాలా జరిగాయి. ఇప్పుడు మార్కెట్‌లోకి వచ్చిన క్యూఆర్ కోడ్‌ల స్పీకర్లు అక్రమార్కులకు చెక్‌పెడుతున్నాయి. ఆన్‌లైన్ చెల్లింపు జరగ్గానే ఎంత మొత్తం దుకాణదారుని ఖాతాకు జమ అయ్యిందనే విషయం స్పీకర్‌లో బయటకు వాయిస్ రూపంలో వినిపిస్తోంది. దీంతో డిజిటల్ మోసాలకు అడ్డుకట్ట పడుతుందని వ్యాపారులు వెల్లడించారు.

కోవిడ్‌తో మార్పులు

తొలుత డిజిటల్ పేమెంట్లు పెద్ద పెద్ద వ్యాపార సంస్థలకే పరిమితమైంది. 2019 కోవిడ్ తర్వాత డబ్బు చెల్లింపులో మార్పులు వచ్చాయి. పేమెంట్ యాప్‌లతో అన్నిచోట్లా ఆన్‌లైన్ చెల్లింపులు పెరిగాయి. కిరాణ, ఫ్యాన్సీ, మందులు, పెట్రోల్, ఇలా పిన్నీస్ నుంచి పిండి వరకూ ఇతర నిత్యావసర వస్తువుల దుకాణాలతో పాటు మొబైల్, డీటీహెచ్, విద్యుత్, గ్యాస్, ఫుడ్ డెలివరీకి కూడా ఈ యాప్‌ల నుంచి చెల్లింపులు జరుగుతున్నాయి.,

చిరు వ్యాపారుల చెంతకు..

టీ స్టాళ్లు, రోడ్డు పక్కన టిఫిన్ బళ్లు, కూరగాయలు, పానీపూరీ బండ్లు ఇలా చిరు వ్యాపారాలు చేసే వారంతా ఆన్‌లైన్ చెల్లింపులను పోత్సహిస్తున్నారు. దీంతో చిల్లర సమస్య ఉండడం లేదు. ఎక్కడైన చిన్న వ్యాపారం మొదలు పెట్టినా చాలు పేమెంట్ యాప్‌లకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌లను ఆయా సంస్థల ఏజెంట్లు క్షదుకాణాల్లో అందజేస్తున్నారు.



ఎక్కువ శాతం ఆన్‌లైన్ చెల్లింపులే

మా దుకాణానికి వచ్చే ఖాతాదారులు వందలో 80 మంది యూపీఐ ద్వారా నగదు చెల్లింపులు చేస్తున్నారు.గతంలో ఏదైనా వస్తువు కొనుగోలు చేస్తే చిల్లర సమస్యతో కొంత వ్యాపారం జరిగేది కాదు.ఇప్పుడు ఆ చిల్లర సమస్య తొలగిపోయింది..

– రాజేష్,
కిరాణ దుకాణం నిర్వాహకుడు. నడుపూరు

ఎక్కడ చూసినా ఆన్‌లైన్ పేమెంట్సే

మాది వుడా కాలనీలో చిన్న కిరాణ షాపు. పాన్ షాప్, పిండి మిల్లు నిర్వహిస్తున్నాం.ఏ చిన్న వస్తువు కావాలన్నా మా దగ్గరకు వచ్చే కొనుగోలు దారులు ఎక్కువ శాతం ఆన్ చెల్లింపులే చేస్తున్నారు.దీంతో చిల్లర సమస్య లేదు.నేను సామాన్లు కొనేటప్పుడు హోల్ సేల్ దుకాణదారులకు ఆన్ పేమెంట్ చేయడంతో డబ్బుపట్టుకెళ్లే సమస్య లేదు.

– ముమ్మిడిశెట్టి ముత్యాలశెట్టి,
చిరు వ్యాపారి,వుడాకాలనీ, పెదగంట్యాడ

నిరుపేదలకు నిత్యావసర సరకులు



నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరకులు అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: అద్దె ఇంట్లో ఉంటూ అకస్మాత్తుగా మృతిచెందిన దినసరి కూలి కుటుంబానికి సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ తక్షణ సహాయంగా నెలకు సరిపడా నిత్యావసర సరకులు అందించింది. అగనంపూడికి చెందిన నిరుపేద మృతిచెందడంతో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ట్రస్ట్ స్పందించింది. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.భాస్కరరాజు చేతుల మీదుగా 25కేజీల బియ్యం , కందిపప్పు, నూనె, గోధుమ పిండి, నూక, చింతపండు ఇతర సామగ్రి అందించింది. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకుడు గుదే సుశీలా గజేంద్రరావు, ప్రధాన సలహాదారు పట్టా రామ అప్పారావు, ప్రతినిధులు శీరంశెట్టి గోవిందరావు, బొండా ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి సత్కారం



బదిలీ అయిన ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న గ్రామస్తులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు తలారివానిపాలెం మండల పరిషత్ పాఠశాలలో పనిచేసి కోటవురట్ల మండలానికి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు ఆర్.గణపతిని సోమవారం గ్రామ కమిటీ సత్కరించింది. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ నాయకుడు తలారి వెంకటరమణ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల పెరుగుదలకు గణపతి మాస్టారు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో బలిరెడ్డి సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.విజయదుర్గ, తలారి దేముడు, శ్రీనివాసరావు, సత్యనారాయణ, తాతబాబు, మంగరాజు, బొడ్డపల్లి అప్పారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గురుపౌర్ణమి ఉత్సవాలు ప్రారంభం



పూజలందుకుంటున్న సాయినాథుడు

పెదగంట్యాడ: సమతానగర్‌లోని షిర్డీ సాయి శాంతిధామంలో గురుపౌర్ణమి ఉత్సవాలకు సోమవారం శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా సాయిబాబాను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ కొల్లి సత్యంబాబు మాట్లాడుతూ ఈ నెల 10న గురుపౌర్ణమిని పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 10న ఏకాదశ రుద్రాభిషేకం, మధ్యాహ్నం అన్న సమారాధన, సాయంత్రం నాట్యారాధన సంగీతం, నృత్య అకాడమీ వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఈఆర్వో దయానిధి

గాజువాక: అర్హులందరికీ ఓటు హక్కు ఉండే విధంగా బీఎల్వోలు కృషి చేయాలని ఈఆర్వో దయానిధి సూచించారు. గాజువాక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన బీఎల్వోల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఓటర్ల నమోదులో బీఎల్వోలు పక్కాగా వ్యవహరించాలన్నారు. ఓటరు జాబితాల్లో మార్పులు, చేర్పుల విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని సక్రమంగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో గాజువాక తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుడి అరెస్టుతో కలకలం

కూర్మన్నపాలెం: డ్రగ్స్ కేసులో స్థానికంగా ఉంటున్న వైద్యుడిని నగర పోలీసులు అరెస్టు చేయడంతో కూర్మన్నపాలెంలో గందర గోళం నెలకొంది. ఈ ప్రాంతంలో ఎక్కడ నలుగురు గుమిగూడినా డాక్టర్ అరెస్టుపైనే చర్చ కొనసాగుతుంది. డ్రగ్స్ సంస్కృతి మన ప్రాంతానికి కూడా తాకిందా అని ముక్కున వేలుసుకుంటున్నారు. కూర్మన్నపాలెం ప్రధాన రహదారిలో ఆస్పత్రి నిర్వహిస్తున్న డాక్టర్ కె.ఎస్.కె.చైతన్యవర్మను విశాఖ సిటీ ట్రిటాన్ పోలీసులు ఆదివారం అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. మంచి సేవలు అందించే ఆస్పత్రికి చెందిన వైద్యుడే డ్రగ్స్ కేసులో మూడో నిందితుడిగా ఉండడాన్ని నమ్మలేక పోతున్నారు. యువకుడైన వైద్యుడు డ్రగ్స్‌కు అలవాటు పడ్డాడా.. వాటిని ఎందుకైనా ఉపయోగించడానికి తీసుకున్నాడా అన్న అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. ఈ కేసులో ఇంకా ఎవరెవరు ఉన్నారో అని చర్చసాగుతోంది.

దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా భెల్‌లో ధర్నా



ధర్నాలో పాల్గొన్న కార్మికులు

గాజువాక: ఈ నెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా బీహెచ్ఈఎల్‌లోని ప్రొగ్రసివ్ ఫ్రంట్ నాయకులు సోమవారం ఆ సంస్థ మెయిన్ గేటు వద్ద ధర్నా నిర్వహించారు. ఫ్రంట్ నాయకుడు జి.టి.పి.ప్రకాష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్స్ అత్యంత ప్రమాదకరమైనవని అన్నారు. ఈ కోడ్స్ వల్ల కార్మికులు సమ్మె చేసే హక్కు, సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యంతో చర్చలు జరిపే హక్కు కోల్పోతారని అన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ నాయకులు ఎస్.జగన్నాథరావు, సీహెచ్.మురళీశ్వరరావు, జి.అచ్చన్ననాయుడు, హనుమాన్, ఎస్.అప్పారావు, హెచ్.భోగేష్ తదితరులు పాల్గొన్నారు.

విజేతకు అభినందన

అగనంపూడి: ఈ నెల 2 నుంచి 6వ తేదీ వరకు శ్రీలంకలోని కొంబోలో నిర్వహించిన 9వ దక్షిణాసియా కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో విజ్ఞాన్ మహిళా కళాశాల విద్యార్థి లిఖితకు రజత పతకం దక్కింది. ఈమేరకు సోమవారం విద్యార్థినిని కళాశాల ప్రిన్సిపాల్ బి.అరుంధతి, అధ్యాపకుల బృందం అభినందించింది.

మిగులు భూములు నిర్వాసితులకే...





నిర్వాసితుల ఐక్యవేదిక సభలో మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు, పాల్గొన్న నిర్వాసితులు

వ్యవసాయ శాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్

అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగారం వినియోగించగా మిగులు భూములను తిరిగి రైతులకు అప్పగించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖమాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్ చేశారు. 16 నిర్వాసిత కాలనీల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం 85వ వార్డు పెమదడక మల్టీపర్పస్ కమ్యూనిటీ హాలు వద్ద ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. భూములు తిరిగి ఇవ్వని పక్షంలో వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌గా ప్యాకేజీ ఇవ్వాలని, వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అందించేంత వరకు ప్రతీనెలా జీవన భృతిగా నెలకు రూ.25వేలు ప్రతీ నిర్వాసితునికి అందివ్వాని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ మాజీ సలహదారు మహాదేవ్, పీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.కొండారెడ్డి మాట్లాడుతూ తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, ఉక్కులో ఉపాధి దొరుకుతుందనే ఆశతో భూములు ఇస్తే ఆ భూములపైనే కన్నేసిన కేంద్ర ప్రభుత్వ పెద్దలు గద్దాల్లా తన్నుకుపోవాలని చూస్తున్నారన్నారు. దీన్ని చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రతినిధి వి.ఎస్.కృష్ణ, లీడర్ పత్రికా సంపాదకుడు పి.రమణమూర్తి, 85వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జి.పూర్ణానందశర్మ (పూర్ణ) మాట్లాడుతూ ద్ర రాష్ట్రానికి వెన్నెముఖ లాంటి విశాఖ ఉక్కును నిర్వీర్యం చేసి ఉద్యోగులను తగ్గించి, కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టాలని చూస్తుందని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల సొమ్మును ఉక్కు ఖాతాలో జమచేసి ఆ సొమ్ముతో స్వచ్ఛంద పదవీ విరమణ చేయించడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఐక్య వేదిక నాయకులు విందుల చిరురాజు, గళ్లా రామకృష్ణ, ఎం.వెంకటేష్, చిన్నారావు, అప్పలరాజు, బళ్ల పైడిరాజు,నారాయణరావు,నరసింగరావు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం



ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా తదితరులు

పెదగంట్యాడ: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపన దినోత్సవాన్ని మండలంలోని పెదగంట్యాడ జంక్షన్‌లోని ఎస్సీ కాంప్లెక్స్ వద్ద సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పేరిలా ఎలీషా బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్, ఇంటక్ నాయకుడు మంత్రి రాజశేఖర్, గంట్యాడ గురుమూర్తి, మార్టుపూడి పరదేశి, గంట్యాడ గోవిందరాజు, పులి రమణారెడ్డి, పెద్దాడ సోమునాయుడు, మంత్రి శంకరనారాయణ, కాకినాడ పెంటారావు, డాక్టర్ ఎస్ రాజారావు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 76వ వార్డు బాబూ జగ్జీవన్‌రామ్ కాలనీ సామాజిక భవనం వద్ద మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రమణ, దీపక్, మనోహర్ పాల్గొన్నారు.

విమల విద్యాలయం ప్రారంభించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ గంగారావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని విశాఖ విమల విద్యాలయం (వివివి)ను వెంటనే ప్రారంభించాలని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు కోరారు. కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు సోమవారం పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో సుమారు 1600 మంది విద్యార్థులు చదువుతున్నారని... విద్యా సంవత్సరం ప్రారంభమై 25 రోజులు గడుస్తున్నా ఇంత వరకు పాఠశాల తెరుచు కోలేదన్నారు. ఈ అంశంపై గత నెల 23న ఉక్కు యాజమాన్యం, దయాసిస్ సంస్థ, ఉపాధ్యాయుల సమక్షంలో జరిగిన చర్చల్లో పాఠశాల తెరవడానికి రాతపూర్వక హామీ ఇచ్చిందన్నారు. అయినప్పటికీ స్కూల్ గుర్తింపు కొనసాగించాలని డీఈవోకు ఉక్కు యాజమాన్యం లేఖ ఇవ్వలేదన్నారు. వెంటనే జోక్యం చేసుకొని వీవీవీని ప్రారంభించడంతో పాటు కేవీలో అడ్మిషన్లు నిలిపివేసినందుకు ఉక్కు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఫెన్సింగ్ నిర్మాణానికి ఆర్థిక సాయం

గాజువాక: గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఫెన్సింగ్ నిర్మాణానికి స్థానిక బీజేపీ నాయకుడు గూటూరు శంకరరావు రూ.10వేలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.విజయ ప్రశాంతికి సోమవారం అందజేశారు.

కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎం.హరినాథ్, ఎం.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కూటమి మోసాలను ఇంటింటికీ వివరిద్దాం



బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న తిప్పలదేవన్‌రెడ్డి తదితరులు

గాజువాక: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ఇంటింటికీ వివరించాలని వైఎస్సార్ సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి కోరారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం 68వ వార్డులో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవన్‌రెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల పేరుతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను నిలువునా మోసగించిందన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయడంలేదన్నారు. మరోపక్క ప్రజలపై భారాలు మోపుతుందన్నారు. చంద్రబాబు హామీలను నమ్మి ఓట్లు వేసిన ప్రజలు ఇప్పుడు బాధ పడుతున్నారన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఐదేళ్లపాటు రాష్ట్రానికి సుపరిపాలన అందించారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన మరుక్షణం అమలు చేశారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం హామీల ఊసే ఎత్తడంలేదన్నారు. ఈ విషయాలను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించాలన్నారు. వార్డు కార్పొరేటర్ గుడివాడ సాయి అనూష ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు గుడివాడ లతీష్, సంద్రాన నూకరాజు, చింతపల్లి ఈశ్వరరావు, జీలకర్ర నాగేంద్ర, వరదాడ చిట్టిబాబు, పోలవరపు శ్రీహరి, గుర్రం త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

బాబు మోసాలు ప్రజల్లోకి..



నడుపూరులో క్యూ ఆర్‌కోడ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: అధికారం వచ్చాక ఇచ్చిన హామీలను మర్చిపోయిన మోసగాళ్లు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అని వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. జీవీఎంసీ 76వ వార్డు పరిధి నడుపూరులో వార్డు అధ్యక్షుడు మంత్రి శంకరనారాయణ ఆధ్వర్యంలో గ్రామ స్థాయి పార్టీ విస్తృత సమావేశం నిర్వహించారు. దేవన్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కుర్చీకోసం కూటమిగా ఏర్పడి సూపర్‌సిక్స్ పేరుతో చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ ప్రజలకు వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులను నమ్మించి.. కనీసం పనులు కూడా లేకుండా మోసం చేశారని ధ్వజమెత్తారు. అధికార దాహంతో 143 హామీలు గుప్పించి కేవలం రెండు, మూడు అరకొరగా అమలు చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ప్రతి గడపకు వెళ్లి బాబు మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూ ఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు సీహెచ్ అప్పారావు, కె. తాతారావు, కె. పెంటారావు, రమణ, పి. మహాలక్ష్మి, నాగేశ్వరరావు, బ్రహ్మారెడ్డి,రామారావు, రామజ్యోతి పాల్గొన్నారు.



7వ వార్డు నాయకులతో మాట్లాడుతున్న తిప్పల దేవన్‌రెడ్డి

- 75వ వార్డు అధ్యక్షుడు గొందేశి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన దేవన్‌రెడ్డి మాట్లాడుతూ గడప గడపకూ వెళ్లి చంద్రబాబు మోసాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మార్టుపూడి పరదేశి, నక్క వెంకటరమణ, గొందేశి వెంకటరమణారెడ్డి, గంట్యాడ గొవిందరాజు, పిట్టా రెడ్డి, అప్పలరెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన విద్యుత్ హైటెన్షన్ టవర్



ఓ ఇంటిపై పడిన టవర్

పెదగంట్యాడ: దొంగల చేతివాటానికి గంగవరం సబ్‌స్టేషన్ నుంచి మెడ్‌టెక్ జోన్‌కు వెళ్లే 33కేవీ హైటెన్షన్ టవర్ నేలకొరిగింది. టవర్ కింద ఉన్న బోల్టును దొంగలు ఎత్తుకెళ్లడంతో టవర్ ఒక్కసారిగా హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని ఓ ఇంటిపై పడడంతో బాత్‌రూమ్ ధ్వంసమైంది. టవర్ కూలిన సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. దీంతో విషయం తెలుసుకున్న ఏపీఈపీడీసీఎల్ ఏఈ రాజేంద్రప్రసాద్ ఘటన స్థలానికి చేరుకుని న్యూపోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ కామేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తరచూ ఇటువంటి దొంగతనాలు జరుగుతున్నాయని, శుక్రవారం రాత్రి కూడా ఒక టవర్ ఇదే మాదిరిగా నేలకొరిగిందని పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.